సాక్షి
పల్నాడు

బుధవారం ၊ 31 ၊ మే ၊ 2023



ఉపాధి కార్యాలయం తనిఖీ

పిట్టలవానిపాలెం: ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్ నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. కూలీలకు బిల్లులు చెల్లించాలని ఆదేశించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.2,000, మోడల్ ధర రూ.1,300 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.60 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష కేంద్రం పరిశీలన



గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో ఎపికైన అభ్యర్థులకు జూన్ 3 నుంచి జూన్ 10 వరకూ మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్, పరీక్షల కో–ఆర్డినేషన్ అధికారి జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం పరీక్షలు జరిగే పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను మొత్తం 692 మంది అభ్యర్థులు రాస్తారని, పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందని వివరించారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9–45 గంటల లోపు మాత్రమే అనుమతిస్తామని వెల్లడించారు.

రాష్ట్రంలో 500 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు



ఫిరంగిపురం: రాష్ట్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు 500 వరకు ఉన్నట్లు నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్ చెప్పారు. మండలంలోని నుదురుపాడులో సహజమిత్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గోపాల్ మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి కృషి చేయనున్నట్లు వెల్లడించారు. మూడు జిల్లాల్లో నాబార్డు ఆర్థిక సహకారంతో వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మూడు జిల్లాల్లో ఇప్పటివరకు 55 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పనిచేస్తున్నట్లు వివరించారు. అనంతరం సంఘం కలెక్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. రైతులు పండించిన ఉత్పత్తులు, జూట్ బ్యాగులు, మహిళలు తయారు చేసిన మగ్గం అల్లికలను ప్రదర్శించారు. వీటిని గోపాల్ తిలకించారు. సమావేశంలో నాబార్డు డీజీఎం అరుణరాజన్, ఏజీఎం దీక్షాభూపేంద్ర, గుంటూరు డీజీఎం శరత్‌బాబు, మిలాన్‌చౌహాన్ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పొన్నపల్లి వీఆర్వో

రూ.18 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం



పొన్నపల్లి వీఆర్వో స్వాతి

చెరుకుపల్లి(రేపల్లె): లంచం తీసుకుంటుండగా వీఆర్వోను ఏసీబీ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఈ ఘటన చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలో జరిగింది. ఏసీబీ డీఎస్పీలు ప్రతాప్, సత్యానంద్ కథనం ప్రకారం.. గుళ్లపల్లికి చెందిన వాగు దినేష్ కుటుంబ సభ్యులకు పొన్నపల్లిలో 1.50 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలని ఈనెల 24న పొన్నపల్లి వీఆర్వో నీలం స్వాతిని సంప్రదించారు. దీనికి రూ.20 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తాను అంత సొమ్ము ఇచ్చుకోలేనని ఎంత బతిమిలాడినా వీఆర్వో స్వాతి ఒప్పుకోలేదు. ఎన్నిసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. చివరికి రూ.18వేలు ఇస్తే ఆన్‌లైన్ చేసేందుకు వీఆర్వో ఒప్పుకున్నారు. ఈ క్రమంలో దినేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పొన్నపల్లిలోని గ్రామ సచివాలయంలో దినేష్ నుంచి రూ.18 వేలు లంచం తీసుకుంటుండగా వీఆర్వో స్వాతిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ అధికారులు వివరించారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధారమణశ్రీ



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధారమణశ్రీ నియమితులయ్యారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న కళావతమ్మను ప్రభుత్వం బదిలీ చేసింది. మంగళవారం జరిగిన ప్రమోషన్స్‌లో ఆమె విజయవాడ నుంచి గుంటూరు నర్సింగ్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. గుంటూరుకు చెందిన డాక్టర్ రాధారమణశ్రీ గతంలో గుంటూరు నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు.

సర్కారు విద్యయభేరీ

చదువుల చంద'మామ' చల్లని వెన్నెల కురిపించినట్టు.. విద్యా విప్లవ జ్యోతి కాంతులీనింది. హరిత వనాలే తరలివచ్చినట్టు.. ప్రభుత్వ పాఠశాలల్లో నవ వసంతం వెల్లివిరిసింది. ఇంద్రధనస్సులే విరిసినట్టు.. శిథిల భవనాలు సుందరరూపమెత్తి మెరిశాయి. కొత్త ఉషస్సులేవో ఉదయించినట్టు తరగతి గదులు సకల వసతులతో తళతళలాడాయి. నవరత్నాలే భవ్య బాటై మెరిసినట్టు.. చిన్నారుల మోము వెలుగురేఖై మిలమిలలాడింది. వరాల రేడు సిరుల జల్లు కురిపించినట్టు.. అమ్మఒడి సంతోషాల సంబరమైంది. వీణాపాణి విజయభేరి మోగించినట్టు.. సర్కారు విద్యా.. జయహో అంటూ జన గళాలన్నీ ఒక్కటై జయజయధ్వానాలు చేస్తున్నాయి.

చదువుల విప్లవానికి నాలుగేళ్లు

- మన బడి నాడు–నేడుతో నవశకం
- సకల వసతులతో సుందరంగా ప్రభుత్వ పాఠశాలలు
- జగనన్న అమ్మఒడి విద్యా కానుక, గోరుముద్ద, ఆంగ్ల బోధనతో పెరిగిన ప్రవేశాలు
- విద్యాదీవెన, వసతి దీవెనతో ఉన్నత చదువులకు ప్రోత్సాహం
- టీచర్ల కొరత లేకుండా పటిష్ట విద్యాబోధనకు చర్యలు



గుంటూరులో మనబడి నాడు–నేడు ద్వారా ఆధునికీకరించిన ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల



గుంటూరు ఎడ్యుకేషన్: శిథిల భవనాలు, విరిగిన బెంచీలు, సరిగా రాయని బ్లాక్‌బోర్డు, ఉపాధ్యాయుల కొరత, అరకొర విద్యాబోధన.. ఇదీ గత ప్రభుత్వ హయాంలో సర్కారు పాఠశాలల దుస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ఈ పరిస్థితి మారిపోయింది. చదువుల విప్లవానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మనబడి నాడు–నేడు అమలుతో పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. ఈ పథకం మొదటి విడతలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1,183 పాఠశాలలను ప్రభుత్వం రూ.283 కోట్లతో ఆధునికీకరించింది. ప్రస్తుతం మనబడి నాడు–నేడు రెండో దశ ద్వారా ఒక్క గుంటూరు జిల్లాలోనే 563 స్కూళ్లలో రూ.202 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

నాలుగేళ్లలో పెరిగిన ప్రవేశాలు

జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద, ఆంగ్ల బోధన తదితర కార్యక్రమాలు పేదింటి విద్యను బలోపేతం చేశాయి. పిల్లలను బడిబాట పట్టించాయి. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచాయి.



సకల వసతులతో తీర్చిదిద్దిన తరగతి గది

2018–19 నాటికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 3,44,787 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువుతుండగా, ఇప్పుడు ఆ సంఖ్య 4,76,858కి చేరింది. పరిమితికి మించి ప్రవేశాలు ఉండడంతో గత ఏడాది చాలా పాఠశాలల వద్ద నో–అడ్మిషన్ బోర్డులు పెట్టక తప్పలేదు. ఈ ఏడాదీ అదేస్థాయిలో ప్రవేశాలు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

కార్పొరేట్ స్థాయికి : జగనన్న విద్యాకానుకతోపాటు ఆంగ్ల విద్యాబోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ కార్పొరేట్ స్థాయికి సర్కారు చదువును తీసుకెళ్లాయి. ఏటా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందుతోంది. జగనన్న గోరుముద్ద ద్వారా 3,448 పాఠశాలల్లో 3.63 లక్షల మందికి పోషకాహారం అందుతోంది.

ఉన్నత చదువులకు ప్రోత్సాహం

ఉన్నత చదువుల ప్రోత్సాహం కోసం ప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తోంది. ఇప్పటివరకు విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా ఒక్క గుంటూరు జిల్లా పరిధిలోనే 36,962 మంది విద్యార్థులకు ప్రభుత్వం రూ.625.55 కోట్లు చెల్లించింది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో గత మూడేళ్లలో ప్రవేశాలు ఇలా..

సంవత్సరం	కొత్తగా చేరిన విద్యార్థులు	మొత్తం విద్యార్థుల సంఖ్య
2019–20	41,213	3,86,000
2020–21	32,626	4,18,626
2022–23	58,232	4,76,858

ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమ్మఒడి లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నగదు జమ (రూ.కోట్లలో)
2019–20	4,00,377	600.56
2020–21	4,25,524	638.28
2021–22	4,79,991	719.98

విద్యావ్యవస్థకు జవసత్వాలు



విద్యావ్యవస్థలో ప్రభుత్వం జవసత్వాలు నింపింది. ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణం పోసింది. మనబడి నాడు–నేడు ద్వారా దాదాపు 1,183 పాఠశాలల రూపు రేఖలను సమూలంగా మార్చివేసింది. పేద పిల్లలకు ఆంగ్ల బోధనను చేరువ చేసింది. సర్కారు విద్యావ్యవస్థపై తల్లిదండ్రులకు నమ్మకాన్ని పెంచింది.

– కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం



గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనేక పథకాలు అమలు చేస్తోంది. విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తోంది. విద్యా పథకాలకు రూ.వేల కోట్లు కేటాయించి దిగ్విజయంగా అమలు చేస్తోంది. విద్యారంగాభివృద్ధిలో అధికారులను భాగస్వాములను చేస్తున్నందుకు గర్వపడుతున్నాం.

– పి. శైలజ, డీఈవో, గుంటూరు

భూరక్ష రీసర్వే వందశాతం పూర్తిచేయండి

కలెక్టర్ శివశంకర్ ఆదేశం



ఆన్‌లైన్ ప్రక్రియ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం ద్వారా జరుగుతున్న రీ–సర్వే కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో రీ–సర్వే జరిగిన గ్రామాలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతుండగా, కలెక్టర్ దానిని పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఈ సర్వే పనులు నిర్వహించిన తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నరసరావుపేట పరిధిలో సర్వే జరిగిన ఒక గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ స్టేజ్ నుంచి ఆర్.ఓ.ఆర్ స్టేజ్ వరకు చేసిన పనుల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. నరసరావుపేట పరిధిలో 14 గ్రామాలు ఉండగా, 11 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే ఎనిమిది గ్రామాల్లోని రైతులకు శాశ్వత హక్కు పత్రాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన మూడు గ్రామాలలో జూన్ చివరి నాటికి భూ హక్కు పత్రాలను అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రీ సర్వే పనుల అమలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు, ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, తహశీల్దార్ ఆర్‌వీ రమణా నాయక్, సర్వేయర్లు, సర్వే నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో 98శాతానికి పైగా హామీలు అమలు

- విద్య,వైద్యం, వ్యవసాయ రంగాల్లో గొప్ప సంస్కరణలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంత్రి రజిని మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. 2019 మే 30వ తేదీ రాష్ట్ర చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందని చెప్పారు. అదే రోజు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన జగనన్న పేదల గుండెల్లో చోటు సంపాదించుకొనేలా పరిపాలిస్తా అంటూ ఏదైతే చెప్పారో అదే ఆచరణలో చూపారని వివరించారు. ప్రతి పక్షంలో ఉండగా జగనన్న 3,648 కిలో మీటర్ల సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించి, ప్రజల కష్టాలు చూసి ఏ హామీలైతే ఇచ్చారో ఆ హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సాధించారని పేర్కొన్నారు. ఈ నాలుగేళ్ల జగనన్న ప్రభుత్వం ప్రజలకు ఏ స్థాయిలో మేలు చేసిందో ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త సగర్వంగా చెప్పుకొనేలా పరిపాలన కొనసాగిందని చెప్పారు.

కీలక రంగాల్లో సంస్కరణలు

వైద్య ఆరోగ్య రంగంలో జగనన్న గొప్ప మార్పులు చేశారని వెల్లడించారు. ఏకంగా 17 మెడికల్ కళాశాలలు నిర్మిస్తున్నారని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలను ఊరూరా నిర్మించటం ద్వారా ప్రభుత్వాన్ని రైతుల చెంతకు చేర్చిన ఘనత జగనన్న సొంతమని మంత్రి పేర్కొన్నారు.

గతంలో ఏ నాయకుడు చేయని విధంగా..

గతంలో ఏ నాయకుడు చేయని విధంగా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ సున్నావడ్డీ రుణాలు ఇలా ఎన్నో పథకాలు మహిళల కోసమే అమలు చేస్తూ... వారిని ఆర్థికంగా ఎదిగేలా సీఎం చేస్తున్నారని వివరించారు. వీటి ఫలితంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అపూర్వ స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాలు తీసుకొచ్చి ప్రభుత్వ సేవలను ఇంటింటికీ చేరువ చేశారని చెప్పారు. విలేజ్‌హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రభుత్వ వైద్యాన్ని గ్రామ స్థాయికి తీసుకొచ్చారని వెల్లడించారు. కోవిడ్ లాంటి కష్టాలు చుట్టుముట్టినా ప్రజలకు పూర్తి స్థాయిలో అండదండలు అందించిన గొప్ప నాయకుడు జగనన్న పాలనలో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

జన్మభూమి కమిటీలు దోచుకున్నాయి

మరోవైపు చంద్రబాబునాయుడు పాలనలో ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని మంత్రి తెలిపారు. బాబు హయాంలో చెత్త జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలను దోచుకుతిన్నారని మండిపడ్డారు. జగనన్న పాలనకు, చంద్రబాబు పాలనకు మధ్య తేడా ప్రజలకు తెలుసని చెప్పారు. చంద్రబాబు చేసిన మోసాలు ప్రజలకు ఇంకా గుర్తున్నాయని వెల్లడించారు.

జన హృదయాలు గెలిచార్

- ఊరువాడా సంబరం
- జగనన్న నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా అంబరాన్నంటిన వేడుకలు
- భారీగా సేవా కార్యక్రమాలు
- రోగులకు పాలు, పండ్లు పంపిణీ



చిలకలూరిపేటలో కేక్ కట్‌చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సత్తెనపల్లిలో కేక్ కట్ చేస్తున్న జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, నరసరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన నాలుగేళ్లు దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం పల్నాడు జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి. వైఎస్సార్ సీపీ కార్యాలయాల్లో నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. తొలుత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించారు. పార్టీ ఆధ్వర్యంలో భారీగా సేవా కార్యక్రమాలు చేశారు.

- చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కేక్ కట్ చేశారు. ముందుగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాజకీయాల్లో ఏ నాయకుడికైనా విశ్వసనీయత ముఖ్యమని తెలిపారు. ఎవరైనా మాట ఇస్తే నిలబెట్టుకోవాలని చెప్పారు. జగనన్న ప్రజల విశ్వసనీయతను చూరగొన్నారని చెప్పారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతానికిపైగా అమలు చేసి ప్రజల చేత భేష్ అనిపించుకున్నారని వెల్లడించారు. మరోవైపు చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల సమయంలో 600కుపైగా హామీలు ఇచ్చి.. ఒక్క హామీనీ పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. పైగా ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు కనపడనీయకుండా మాయం చేశారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మళ్లీ ఆల్‌ఫ్రీ అంటూ ఎన్నికల విన్యాసాలు చేస్తున్నారని పేర్కొన్నారు.



కారంపూడిలో కేక్ కట్ చేస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

- ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలోనూ సంబరాలు జరిగాయి. కారంపూడి పట్టణం ఇందిరానగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భారీ కేక్‌ను ఆయన కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ నాలుగేళ్లలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలకు సుపరిపాలన అందిందని పీఆర్కే పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మరోసారి జగనన్న ప్రభుత్వం ఏర్పాటు కానుందని, దీన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.
- ఈ నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ద్విచక్ర వాహన ర్యాలీ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రెడ్‌క్రాస్ సహాయంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 300మంది రక్తదానం చేశారు. రోగులకు రొట్టెలు, పండ్లు అందజేశారు.
- వినుకొండ పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం జోరు వర్షంలోనూ వందలాది మంది నాయకులు, కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే బైక్ ర్యాలీ నిర్వహించారు. నాలుగేళ్ల పాలనపై ప్రశంసల జల్లు కురిపించారు. మరోసారి జగనన్న ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు.
- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో అమరావతి నుంచి దిడుగు వరకు కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రజాపాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేయాలని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు.
- ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు మహానాడులో కొత్త డ్రామాలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టి జగనన్నను మరోసారి సీఎంను చేయాలని మంత్రి అంబటి రాంబాబు ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సత్తెనపల్లి రఘురాం నగర్‌లోని వెంకటేశ్వర గ్రాండ్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన బీసీ సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా అంబటి కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. ప్రజలు మరోసారి సంక్షేమ ప్రభుత్వం గద్దెనెక్కాలని కోరుకుంటున్నారని, జగనన్న ప్రభుత్వం మరోసారి ఏర్పాటు కాబోతుందని స్పష్టం చేశారు. సత్తెనపల్లిలో నన్ను ఓడించేందుకు చంద్రబాబు, పవన్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, అవి ఫలించవని పేర్కొన్నారు. బీసీలు చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఇప్పుడు అది చేస్తా.. ఇది చేస్తా అంటూ గారడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు.



అమరావతిలో బైక్ ర్యాలీలో పాల్గొన్న నంబూరు



వినుకొండలో జరిగిన ప్రదర్శనలో బ్రహ్మనాయుడు



నరసరావుపేటలో ర్యాలీలో పాల్గొన్న గోపిరెడ్డి

బడుగు, బలహీనవర్గాల ద్రోహి చంద్రబాబు

- జీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతతో కుల్లుకుంటున్న అగ్రవర్ణాలు
- జగన్‌కు అండగా నిలుస్తున్న బడుగు బలహీనవర్గాల ప్రజలు
- మళ్లీ రాబోతుంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రభుత్వం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో నియోజకవర్గ స్థాయి బీసీల సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: బడుగు, బలహీనవర్గాల ద్రోహి చంద్రబాబు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వెంకటేశ్వర రెసిడెన్సీలో మంగళవారం నియోజకవర్గ స్థాయి బీసీల సదస్సు నిర్వహించారు. సదస్సుకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్ జంగా కష్ణమూర్తి అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలను వాడుకొని వదిలేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాలకు మాత్రమే వాడుకొని వారికి కనీస గౌరవ, మర్యాదలు ఇవ్వలేదన్నారు. బడుగు, బలహీనవర్గాలు తమకు అండ, దండ అని, ఈ ప్రభుత్వం రాజ్యాధికారానికి దూరంగా ఉన్న వర్గాలకు ప్రాధాన్యతను కల్పిస్తున్న తీరుకు అగ్రకులాలే కుళ్లుకునే పరిస్థితి వచ్చిందన్నారు. నియోజకవర్గంలో తనను ఓడించడమే లక్ష్యంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పన్నాగాలు పన్నుతున్నారని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు నాకు అండగా ఉన్నంత కాలం నా దగ్గరకు కూడా రాలేరన్నారు. టీడీపీ ఆనాడు నిమ్మకాయల రాజనారాయణను వాడుకొని వదిలేస్తే ఈనాడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమైన పదవిని ఇచ్చి సముచిత స్థానాన్ని కల్పించబోతున్న ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. మహిళలకు రూ. 25 వేల కోట్ల డ్వాక్రా రుణమాఫీ చేయలేని చంద్రబాబు రెట్టింపు హామీలు ఎలా ఇస్తున్నావ్ అని దుయ్యబట్టారు. మళ్లీ ఫ్యాన్ తిరుగుతుందని, పేద వాడే గెలుస్తాడని స్పష్టం చేశారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు సామాజిక న్యాయం అమలు చేయడంలో 45 ఏళ్ల కుర్రాడు జగన్‌మోహన్‌రెడ్డిని అనుసరించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో వడ్డెర్లకు రూ.8,376 కోట్లు, యాదవులకు రూ.28 వేల కోట్లు, రజకులకు రూ.17 వేల కోట్లు, వీవర్స్‌కు రూ.17 వేల కోట్లు, నాయీ బ్రాహ్మణులకు రూ.5,700 కోట్లు, ఇలా టీడీపీ ఐదేళ్లలో ఇచ్చిన దాని కంటే వైఎస్సార్ సీపీ నాలుగేళ్లలో 10 రెట్లు అదనంగా ఇచ్చామన్నారు. ఈ ప్రభుత్వం బడుగు బలహీనవర్గాలకు అందించిన సంక్షేమాన్ని మీ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకె ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన జరగాలనే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. బీసీ కులాలపై అధ్యయనం చేసి, అన్ని బీసీ సామాజిక వర్గాలకు రాజ్యాధికార ప్రాధాన్యతను కల్పిస్తున్న ఘనత జగన్‌మోహన్ రెడ్డిదే. బడుగు, బలహీనవర్గాలు నాయకత్వ లక్షణాలు మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉంది.

– జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ

అత్యంత దౌర్భాగ్యుడు చంద్రబాబు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలు అత్యంత దౌర్భాగ్యం. నిబద్ధతలేని హామీలని, ఉచిత పథకాలని విమర్శించిన వాడివి రెండింతలు రెట్టింపు ఎలా చేస్తావ్. బడుగు, బలహీనవర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే. తాను కోరకుండానే పోటీ చేసే అవకాశం కల్పించటం, కొద్దిలో ఓటమి పాలైతే మూడు పర్యాయాలు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా, ప్రస్తుతం శాసనమండలి సభ్యుడిగా జగన్ అవకాశం కల్పించారు.

– చంద్రగిరి యేసురత్నం, ఎమ్మెల్సీ

బడుగులకు అధిక ప్రాధాన్యం

ఈ ప్రభుత్వం రాయలసీమ ప్రాంతంలోనూ బలమైన సామాజికవర్గాలను కాదని అక్కడ కూడా బడుగు, బలహీనవర్గాలకే ప్రాధాన్యం ఇచ్చింది. రాజ్యసభలో 9మందికిగాను ఐదుగురు బీసీలకు అవకాశం కల్పిస్తే, టీడీపీ 10 ఏళ్లలో ముగ్గురికి మాత్రమే అవకాశం కల్పించింది. ఈ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తీసుకు వచ్చింది. బీసీలు అంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారు.

– యర్రం వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

బీసీలకు రూ.1.63 లక్షల కోట్లు ఖర్చు

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.1.63 లక్షల కోట్లు బీసీలకు ఖర్చు చేశారు. 80 వేల మందికి ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించారు. ఆర్థికంగా, రాజకీయంగా, బీసీల అభ్యున్నతికి ఈ ప్రభుత్వం పాటుపడుతుంది. బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్ బోన్ అని జగన్ నిరూపించారు. అందువల్లనే ముక్కోణపు పోటీలో కూడా 151 సీట్లు సాధించటం జరిగింది.

– పక్కాల సూరిబాబు, నియోజకవర్గ నేత

బీసీలకు గుర్తింపు తెచ్చిన జగన్

రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు తెచ్చిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. 139 కులాలను గుర్తించి కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబు ఎన్నికల అనంతరం కరివేపాకులా తీసేశారు. బీసీలను వాడుకొని వదిలేయడం టీడీపీ నైజమైతే, బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత జగన్ మోహన్‌రెడ్డిది.

– నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర కార్యదర్శి, వైఎస్సార్ సీపీ

ఓటు బ్యాంక్‌గా వాడుకున్న చంద్రబాబు

బీసీలను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకొని వదిలేశాడు. బీసీలు ఆకు కాదు అన్నం అనే విషయాన్ని జగన్ నిరూపించాడు. బీసీలను చంద్రబాబు కించపరిస్తే జగన్‌మోహన్‌రెడ్డి అవకాశాలు కల్పించి గౌరవించారు. 50 శాతం రిజర్వేషన్‌తో జగన్ మేలు చేస్తున్నాడు. బీసీలకు మేలు చేయడం, వారిని రాజకీయంగా, ఆర్థికంగా పైకి తేవడమే లక్ష్యంగా పెట్టుకొని జగన్ పాలన సాగిస్తున్నాడు.

– తాడిశెట్టి మురళీ, మాజీ డిప్యూటీ మేయర్, గుంటూరు

ప్రపంచంలో దేశానికి గుర్తింపు తెచ్చిన ప్రధాని మోదీ

- ఆయన నాయకత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపర్చాలి
- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ యాదవ్

నరసరావుపేట: ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఐదో దేశంగా భారతదేశాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిలిపారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రధానిగా మోదీ పదవి చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టే కార్యక్రమాల వివరాలను తెలియచేసేందుకు మంగళవారం సాయంత్రం సత్తెనపల్లిరోడ్డులోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ 2014కు ముందు స్కీము, స్కాములు చేశారన్నారు. మోదీ సంక్షేమం, అభివృద్ధిని తీసుకొని దళారీలు లేకుండా పరిపాలన చేస్తున్నారన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, మంచినీటి సౌకర్యం, గ్యాస్ కనెక్షన్ ఇచ్చారన్నారు. గడిచిన 60ఏళ్లలో చేయని మౌలిక వసతులు ఈ తొమ్మిదేళ్లకాలంలో ఏర్పాటుచేశారన్నారు. కోవిడ్ సమయంలో 200 కోట్ల డోసులు ప్రజలకు ఉచితంగా వ్యాక్సినేషన్ చేశారన్నారు. దేశంలోని అన్నిరాష్ట్రాల అభివృద్ధికి సహకారం అందజేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ మోదీ ప్రధాని అయ్యేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్‌బాబు మాట్లాడుతూ వచ్చే నెలరోజుల వ్యవధిలో కార్యక్రమాలు చేపడతామన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు రవిశంకర్, నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

మార్టూరులో భారీ వర్షం


జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


నీట మునిగిన ఉప్పు కొఠారులు

- హైవేపై నిలిచిన నీరు
- ప్రయాణికుల అవస్థలు

మార్టూరు: ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం మంగళవారం పడింది. ఉదయం 11 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య భారీ వర్షం పడింది. స్థానిక స్వప్న హోటల్ నుంచి కూరగాయల మార్కెట్, జొన్నతాళి స్టేజీ వరకు జాతీయ రహదారిపై సుమారు 2 అడుగుల మేర నీరు నిలిచింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైవే సిబ్బంది ప్రవాహం ఎక్కువగా ఉన్నచోట బారికేడ్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేసి వాహనాలను మళ్లిస్తూ వాహనదారులను, ప్రయాణికులను అప్రమత్తం చేశారు. కొణిదెన రోడ్డులోని ఓ టుబాకో కంపెనీలో సుమారు 500 పొగాకు బేళ్లు వర్షపు నీటిలో మునిగిపోయాయి. రోడ్లు పక్కన ఉంచిన హోర్డింగ్‌లు, రేకులషెడ్లు గాలికి పడిపోగా 2 గంటలు పాటు విద్యుత్, సెల్‌ఫోన్ సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడింది.

నీట మునిగిన ఉప్పు కొఠారులు..

చినగంజాం: మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి ఉప్పు కొఠారులు నీట మునిగాయి. సుమారు 1500 ఎకరాల్లో కొఠారులు వర్షపు నీటితో నిండి పోయాయి. సుమారు 40 వేలు బస్తాల ఉప్పు నీటిపాలయినట్లు రైతులు చెబుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రవీణ్‌కు కాంస్య పతకం



చీరాల రూరల్: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో చీరాల సాయి కాలనీకి చెందిన దేవరకొండ ప్రవీణ్‌కుమార్ కాంస్య పతకం దక్కింది. హైదరాబాద్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో ఐఎండబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని ఇండియా పోస్ట్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన పోటీలలో ప్రవీణ్‌కుమార్ పతకం సాధించాడు. స్నాచ్ 40 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్ 55 కేజీలు ఎత్తి మూడో స్థానం నిలిచాడు. తెలంగాణ మాస్టర్స్ వెయింట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి శ్రుతి నుంచి ప్రవీణ్ మెడల్ అందుకున్నాడు. నెల రోజుల క్రితం రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. చినగంజాం మండలం చింతగుంపల గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో పనిచేస్తున్న ప్రవీణ్‌ను బ్యాంక్ మేనేజర్ అబ్రహం, సిబ్బంది సునీల్, చిరంజీవితో పాటు ఇతర సిబ్బంది అభినందించారు.

పెదకాకానిలో 3న మహాకుంభాభిషేకం

పెదకాకాని: స్థానిక శివాలయంలో జూన్ 3న మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఏసీ విలేకరులతో మాట్లాడుతూ జూన్ 1 నుంచి 3వ తేదీ వరకూ మూడు రోజుల పాటు విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వార్ల సారథ్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ప్రభుత్వ విప్ పీఆర్కే


సుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి

రెంటచింతల: బాపట్ల జిల్లా రేపల్లె మండలం రావి అనంతవరం వద్ద జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పశర్లపాడు గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. సోమవారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గుడిపల్లి చిన్న సుబ్బయ్య మృతదేహాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ పీఆర్కే సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢసానుభూతిని తెలిపారు. ఈ దుర్ఘటనలో మొత్తం నలుగురు మృతి చెందడంతో ఆ కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోవడం విచారకరమన్నారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న గుడిపల్లి చిన్న సుబ్బయ్య భార్య కుమారి, కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జెట్టిపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కొమెర సైదారావు పరిస్థితి విషమంగా ఉందని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన చల్లా చిన్న కాశయ్య నర్సరావుపేట ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వివరించారు. ఇటీవల కాలంలో జరిగిన పలు రోడ్డు ప్రమాదాలలో గ్రామానికి చెందిన 8 మంది మృత్యువాత పడినట్లు పార్టీ నేతలు వెన్నా వెంకటేశ్వరరెడ్డి, చల్లా మట్టారెడ్డిలు పీఆర్కే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట మందాల అక్కిరెడ్డి, గుడిపల్లి గోపాల్, చల్లూరి చెన్నకేశవులు, గుడిపల్లి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

పేదలంతా భాగస్వాములు కావాలి

లీడ్ బ్యాంకు మేనేజరు


మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలందరూ బ్యాంకు ఖాతాలు కల్గియుండి బీమా యోజన పథకాలు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు టీసీ.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌బీఐ ఆదేశాలు మేరకు ప్రభుత్వ రంగ సేవలు బీమా యోజన పథకాలు అమల తీరుపై స్వయం సహాయక మహిళా సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులకు, యానిమేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జన సురక్ష భీమా పథకాలలో భాగస్వామ్యం కండి ..ఆర్థిక ప్రయోజనాలను పొందాలన్నారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకంలో 50 సంవత్సరాలలోపు వారందరూ రూ.436 చెల్లిస్తే సంవత్సరంపాటు ప్రీమియం వర్తించుతుందని ప్రమాదవత్తూ మృత్యువాత పడితే రూ.2లక్షల బీమా సౌకర్యం నామినికి చెందుతుందన్నారు. 70 సంవత్సరాల వారందరు సురక్ష బీమా యోజన పథకంలో రూ.20 చెల్లిస్తే బీమా పథకం వర్తిస్తుందన్నారు. జూన్ 30 వరకు బీమా పథకాల అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. సదస్సులో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్, ఈవోపీఆర్డీ పి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఇస్తమా నిర్వహణకు స్థల పరిశీలన


ఏర్పాట్ల స్థలాన్ని పరిశీలిస్తున్న పీఆర్కే

మాచర్ల: మాచర్ల పట్టణంలో రెండు రాష్ట్రాల స్థాయిలో త్వరలో భారీగా నిర్వహించబోయే ఇస్తమాకు స్థల సేకరణలో భాగంగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముస్లిం పెద్దలతో కలిసి 100 ఎకరాల స్థల పరిశీలన చేశారు. మంగళవారం ముస్లిం నేతలు, మత పెద్దలతో, ప్రజాప్రతినిధులు కలిసి సాగర్ రోడ్డులోని ఎల్‌సికె సిమెంట్ ప్రాంతంలో 100 ఎకరాలకుపైగా కేటాయించటానికి జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారు. ముస్లిం పెద్దలతో ఆయన మాట్లాడుతూ ఇస్తమా కార్యక్రమానికి మంచినీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు తన వంతు సహాయ సహకారాలందిస్తానని తెలిపారు. వారితో కలిసి పూర్తిస్థాయిలో స్థల పరిశీలన జరిపారు. అంతకుముందు ఆ స్థలం ప్రాంతంలో ముస్లిం పెద్దలతో కలిసి ప్రభుత్వ విప్ పిఆర్కే దువా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మాచర్ల పట్టణ మసీదు పెద్దలు, ముస్లిం నేతలు పాల్గొన్నారు.

మనోడికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు

- ఓక్‌విల్లే ఫెస్టివల్స్ ఆఫ్ ఫిల్మ్ అండ్ ఆర్ట్‌లో ప్రదర్శనకు ఎంపిక
- ఇప్పటికే 37 అవార్డులు గెలిచిన సినిమా
- రెండో సినిమా 'ఐడీ'తో ఫిల్మ్ ఫెస్టివల్ సర్క్యూట్‌లో సంచలనం
- నిర్మాతల్లో ఒకరు హర్ష ప్రతాపనేని
- వృత్తి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు, ప్రవృత్తి సినిమా


హర్ష ప్రతాపనేని

తెలుగు సినిమాలకు దీటుగా 'ఐడీ' సినిమా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును గెలుచుకుంది. మరోవైపు ఫిల్మ్ ఫెస్టివల్ సర్క్యూట్‌లో సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటివరకు దాదాపు 37 అవార్డుల్ని అందుకుంది. 31 అఫీషియల్ సెలక్షన్స్‌ను సాధించి, 5 ఆనరబుల్ మెన్షన్స్‌ను అందుకుంది. నాలుగు నామినేషన్లను పొందింది. త్వరలో కెనడీయన్ స్క్రీన్ అవార్డు (ఆస్కార్ తరహాలో)లకు క్వాలిఫైయింగ్ ఫెస్టివల్ అయిన ప్రముఖ ఓక్‌విల్లే ఫెస్టివల్స్ ఆఫ్ ఫిల్మ్ అండ్ ఆర్ట్‌లో ప్రదర్శించనున్నారు. అంతర్జాతీయ అవార్డు వేడుకల్లో సత్తా చాటిన 'బలగం' సినిమా దాదాసాహెబ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ఉత్తమ సంగీతం' అవార్డును అందుకోగా, 'సీతారామం' సినిమా 'ఉత్తమ చిత్రం'గా అవార్డును అందుకుంది. ఐడీ చిత్రం 'ఉత్తమ ఎడిటింగ్'అవార్డును గెలుచుకుంది.

తెనాలి: తెలుగు సినిమా రేంజ్ పెరిగింది.. పాన్ ఇండియా స్థాయికి ఎదిగింది. అందివచ్చిన టెక్నాలజీతో దర్శక నిర్మాతలు వెండితెరపై అద్భుతాల్ని ఆవిష్కరిస్తున్నారు. అదే బాటలో నవతరం సత్తాను చాటుతోంది. వినూత్న ఆలోచనలు, సరికొత్త ప్రయోగాలతో కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నారు. అవార్డుల పోటీలోనూ ముందంజలో ఉంటున్నారు. 'గతం' సినిమా మేకర్స్ దీనికి నిదర్శనం. డార్క్ మిస్టరీ థ్రిల్లర్‌గా తీసిన 'ఐడీ'తో ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డును గెలుచుకున్నారు. సినిమా నిర్మాతల్లో ఒకరైన హర్ష ప్రతాపనేని తెలుగు వాడు...తెనాలి వాడు కావడం విశేషం!

విడుదల కాకముందే అవార్డు

ఓటీటీ బ్లాక్ బస్టర్ మూవీ 'గతం' మేకర్స్ రూపొందించిన రెండో తెలుగు సినిమా 'ఐడీ'. టాలీవుడ్, హాలీవుడ్ టెక్నీషియన్లు పనిచేశారు. చిత్రోమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తీసిన సినిమాకు కిరణ్‌రెడ్డి కొండమడుగుల దర్శకత్వం వహించారు. హర్ష ప్రతాపనేని, సృజన్ యరబోలుతో కలసి సుభాష్ రావాడ, భార్గవ పోలుదాసు నిర్మాతలుగా వ్యవహరించారు. భార్గవ పోలుదాసు, రాకేట్ గలేటీ ప్రధాన పాత్రల్లో నటించారు. 'క్షణం', 'గూఢచారి' సినిమాల ఫేం శ్రీచరణ్ పాకాల సంగీతం సమకూర్చారు. హాలీవుడ్ డీపీ హోరాసియో మార్టినెజ్ సినిమాటోగ్రఫీ అందించగా, కాటిరినా ఫిక్కార్డో ప్రొడక్షన్ డిజైన్ పనులను పర్యవేక్షించగా, ఛోటా కె.ప్రసాద్ ఎడిటింగ్ చేశారు. విడుదల కాకముందే ఈ సినిమా దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో అత్యున్నత గౌరవాన్ని అందుకుంది. విమర్శకుల ప్రశంసలు పొందిన కన్నడ చిత్రం 'చార్లీ 777'ను వెనక్కునెట్టి, 'బలగం', 'సీతారామం' వంటి

వినూత్న కథాంశం

'మీరు ఒక రోజు నిద్రలేచాక, మిమ్మల్ని ఎవరూ గుర్తించకపోతే...'అనే విచిత్రమైన ఆలోచన ఐడీ సినిమా కథాంశం. సహ నిర్మాతగా వ్యవహరించిన హర్ష ప్రతాపనేని తండ్రి పి.వి. గణేష్ స్వస్థలం తెనాలి సమీపంలోని జంపని. ప్రస్తుతం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా ఖమ్మంలో చేస్తున్నారు. తల్లి మంజులాదేవి గృహిణి. తండ్రి ఉద్యోగం కారణంగా వివిధ ప్రదేశాల్లో చదివిన హర్ష, హైదరాబాద్‌లో బీటెక్ చేశాడు. ఒక్లహోమా స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ చేసి, అమెరికాలోని ప్రతిష్టాత్మక జేపీ మోర్గాన్స్ చేజ్ బ్యాంక్‌లో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా చేస్తున్నారు. చదివే రోజుల్లో క్లాస్‌మేట్ కిరణ్‌తో కలసి లఘుచిత్రాలు తీసిన హర్ష, ఉద్యోగంలో కొనసాగుతూనే కిరణ్‌తో కలిసి 'గతం' సినిమా తీశారు. సహ నిర్మాత, సహ దర్శకుడు, సహ రచయితగా వ్యవహరించాడు. గతం విజయంతో ఇప్పుడు 'ఐడీ'తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

సంతమాగులూరు(అద్దంకి): బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఉంటాయని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బాల్య వివాహాలపై నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధులకు అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం, ప్రోత్సహించడం నేరమని చెప్పారు. బాల్య వివాహాలు జరకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని వివరించారు. పోక్సో చట్టం ప్రకారం బాలికను వివాహం చేసుకున్న యువకుడికి 20 ఏళ్లు, 16 ఏళ్లలోపు బాలికను వివాహం చేసుకున్న వరుడికి పదేళ్లు కఠిన కారాగార శిక్ష పడుతుందని తెలిపారు. వివాహానికి హాజరైన వారికి రెండేళ్ల కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధించే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చింతల పేరయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ సుధ, బల్లికురవ ఎంపీపీ హేమలత, సంతమాగులూరు ఎంపీడీఓ కృష్ణ, ఎంఈఓ కోటేశ్వరరావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాహిత్య, సమైక్య సంఘం అధ్యక్షురాలు లక్ష్మీశేషు, ఏపీఎం మస్తాన్‌రావు పాల్గొన్నారు.